క్లుప్తంగా

డెయిరీ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు జాగృతి సమాఖ్య కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకానికి ఎంపికైన డెయిరీ యూనిట్ లబ్ధిదారులకు పాడిగేదెల ఎంపికకు శుక్రవారం పశువైద్యాధికారి డాక్టర్ హరికిషన్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఎస్ నవీన్, వీఏ పర్వయ్య, మహిళా సంఘల ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎఫ్ఏల సమస్యలు పరిష్కరించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ)ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సైకిలాబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన పేస్కేల్ జీతాల పెంపు, ఆరోగ్య బీమా సౌకర్యం ఎఫ్ఏలకు వర్తింపచేయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎఫ్ఏలపై అనేక అక్రమ కేసులు పెట్టారని, వాటిని ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు యాదగిరి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలతో మరింత రక్షణ

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: నూతన చట్టాలతో మహిళలకు మరింత రక్షణ లభిస్తుందని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ నూతన చట్టాలతో నేరస్తులకు కఠిన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు, సిబ్బంది జులైలో కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 15 మంది ఈవ్ టీజర్లను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి, వారిపై ఈ పెట్టి కేసులు నమోదు చేశామన్నారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100, షీటీమ్ వాట్సాప్ నంబర్ 87126 67434కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోక్సో, లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలికలకు స్నేహిత మహిళా సపోర్టు సెంటర్ అండగా ఉంటుందన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు పెండింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.437 కోట్లు కేటాయించడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హుస్నాబాద్‌కు చెందిన వివిధ వర్గాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రిని పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, వ్యాపార సంఘాల నాయకులు కైలాసం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సంఘీభావం

గజ్వేల్‌రూరల్: పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమానికి హాజరయ్యేందుకు శుక్రవారం తరలివెళ్లారు. వారికి డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సంఘీభావం తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు రాజు, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శివారెడ్డి, సర్దార్‌ఖాన్, సమీర్, బోసు, నక్క రాములు పాల్గొన్నారు.

రాజీనామాకు సిద్ధంగా ఉండు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినమాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నారని, మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలను వంద శాతం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి పాల్గొన్నారు.

రాజీనామాకు సిద్ధం

మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, రుణమాఫీ ఆగస్టు 15లోగా చేస్తే ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉంటారని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్దిపేటకు ఆగిపోయిన నిధులను తీసుకువస్తే సంతోషిస్తామన్నారు. రాజీనామాలు హరీశ్‌రావుకు కొత్త కాదన్నారు. మల్కాజిగిరిలో ఓడిపోయిన ఒత్తిడిలో మైనంపల్లి ఉన్నారన్నారు.

బస్సు నడపాలంటూ వినతి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామం మీదుగా సిద్దిపేట నుంచి యాదగిరిగుట్టకు బస్సు నడపాలని కోరుతూ సీపీఐ మండల సమితి నాయకుడు కత్తుల భాస్కర్ రెడ్డి కోరారు. ఈ మేరకు సిద్దిపేట డిపో అసిస్టెంట్ మేనేజర్‌కి వినతిపత్రం ఇచ్చారు.

అభివృద్ధి చేసి.. అప్పుల పాలై

బిల్లుల రాక ఇబ్బందిపడుతున్నాం

మాజీ సర్పంచ్‌ల ఆవేదన | పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

తమ బిల్లుల చెల్లింపుపై అసెంబ్లీలో చర్చించాలంటూ తాజా మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి బయలు దేరారు. శుక్రవారం ఉదయం వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. ఐదేళ్లలో తాము చేసిన అభివృద్ధి పనుల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వడ్డీకి తెచ్చి అభివృద్ధి పనులు చేశామని, వడ్డీలు చెల్లించలేని స్థితిలో ఉన్నామని వాపోయారు. వెంటనే బిల్లులు విడుదల చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోవడంలేదని కన్నీటి పర్యంతమయ్యారు.



చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఏ సర్పంచ్‌ను కదిలించినా రూ. 10 నుంచి రూ.50 లక్షల వరకు రావాల్సి ఉందని చెబుతున్నారు. మండలానికి సుమారు రూ.8 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. గ్రామంలో ఏ సమస్య వచ్చినా ప్రజలు తమకే చెప్పేవారన్నారు. మురుగు కాల్వలు నిండినా, బోరు మోటారు కాలిపోయినా, వీధి దీపాలు వెలుగక పోయినా తమ సొంత డబ్బుతో పనులు చేయించామంటున్నారు. అంతేకాకుండా సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, వైకుంఠధామాలు, 'మన ఊరు-మనబడి' కార్యక్రమంలో పాఠశాలల్లో మరమ్మతులు అప్పులు చేసి చేయించామని వెల్లడించారు. ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పించమని అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా వారు పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.50 లక్షల వరకు రావాలి. పనులు చేయకుంటే గ్రామం అభివృద్ధిలో వెనుకబడుతుందని, అప్పులు చేసి పనులు చేయించాం. బిల్లులు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు. వడ్డీలు కట్టలేకపోతున్నాం. పరిస్థితి దయనీయం ఉంది. ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేయాలి.

- స్వర్ణలత, మాజీ సర్పంచ్, చర్లఅంకిరెడ్డిపల్లి

ప్రభుత్వం పరిష్కరించాలి



గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలి. గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించి రూ.15 లక్షలు రావాలి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి మమ్మల్ని ఆదుకోవాలి. గత ప్రభుత్వం పట్టించుకోలేదు, ప్రస్తుత ప్రభుత్వమైనా మా గోడు పట్టించుకోవాలి.

- సుభాష్ గౌడ్, మాజీ సర్పంచ్, ఇబ్రహీంనగర్

ముందస్తు అరెస్ట్‌లు అప్రజాస్వామికం

మిరుదొడ్డి(దుబ్బాక): పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల పరిధిలోని మాజీ సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపు ఇవ్వడంతో మాజీ సర్పంచ్‌లు వెళ్లకుండా మిరుదొడ్డి, భూంపల్లి పోలీసులు శుక్రవారం ముందస్తుగా వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ఒక్కో సర్పంచ్ రూ.25 నుండి రూ.30 లక్షల వరకు తమ సొంత డబ్బు వెచ్చించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బిల్లులు విడుదలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ బిల్లుల తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు కాలేరు శ్రీనివాస్, బండమీది మల్లయ్య, పోతనక కనకయ్య, ధర్మారం బుచ్చయ్య, జోగ్గారి బాల్‌నర్సింహులు, రంగనబోయిన రాములు, పిట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ముట్టడికి వెళ్తున్న..

దుబ్బాక: అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను శుక్రవారం దుబ్బాక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. తమను అక్రమంగా అరెస్టు చేశారంటూ మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో ఇబ్బందిపడుతున్నామన్నారు. అరెస్టు చేసిన సర్పంచ్‌లను విడుదల చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.



భూంపల్లి పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ తలపెట్టిన ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు శుక్రవారం అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఊట్ల రవీందర్ రెడ్డి, జీడికంటి సుదర్శన్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ (ఏ)లో చేర్చొద్దు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగిన ముదిరాజ్‌లను బీసీ(ఏ) జాబితాలోకి చేర్చొద్దని కోరుతూ తెలంగాణ బీసీ (ఏ) కులాల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంబురాలు

హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.437 కోట్లు మంజూరు చేయడంపై శుక్రవారం రైతులు సంబురాలు జరుపుకున్నారు. వంగరామయ్యపల్లి, పొట్లపల్లి గ్రామాల రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు పునాది వేస్తే నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ మిగతా పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ప్రాజెక్టు పూర్తయితే 1.06 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

పరిశుభ్రతకు ప్రాధాన్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మినీ ట్యాంక్‌ల వద్ద, చిత్తడి ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రావన్నారు. ప్రతీరోజు వార్డుల వారీగా పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ గోవిందు రవి పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్‌రూరల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడేలో మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ ఎపిడమిక్ సెల్ సభ్యులు వాసుదేవ్, నాగరాజు, ఏఎన్ఎం ఉమ, ఆశా వర్కర్లు మహేశ్వరీ, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు కవిత, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను హర్షిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, మంద కృష్ణ మాదిగ చిత్ర పటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. తెలంగాణలో ఇటీవల విడుదలైన జాబ్ నోటిఫికేషన్‌లో ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరాచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

సిద్దిపేటఅర్బన్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సురభి మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో తల్లులకు ముర్రుపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల ప్రయోజనాల గురించి నర్సింగ్ విద్యార్థినులు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో సురభి వైద్య కళాశాల డీన్ డాక్టర్ మహమ్మద్ రఫీ, సీఈఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బతాయి, సీఏఓ రామకృష్ణ, పారా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బ్రహ్మం, ఏఓ అమృత్‌పాల్ సింగ్, పీఆర్వో పర్శరాములు, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

చుంచనకోటలో..

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగమణి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

వర్గీకరణ పోరాటం ఫలించింది



నంగునూరులో మాట్లాడుతున్న నాయకులు



చిన్నకోడూరులో ..

నంగునూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణమాదిగ 30 ఏళ్లు చేసిన పోరాటం ఫలించిందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఎనగందుల యాదగిరి అన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో నంగునూరులో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో శుక్రవారం చిన్నకోడూరులో ఎమ్మార్పీఎస్ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా వర్గీకరణ సాధనకు అలుపెరుగని పోరాటం చేశామన్నారు. పోరాటం చేసిన ఉద్యమ వీరులకు ఈ విజయం అంకితమన్నారు.

తాగునీటి సరఫరా బంద్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. బాల వికాస వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఏడు నెలల విద్యుత్ బిల్లు రూ.11 వేలు బకాయి ఉండటంతో విద్యుత్ అధికారులు బుధవారం ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. రెండు రోజులుగా ప్లాంట్ మూసివేయడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాడిపశువుల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

అక్కన్నపేట(హుస్నాబాద్): పశుపోషకులు మేలు జాతిరకం పశువుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని మల్లంపల్లి పశువైద్యాధికారి రమేశ్ అన్నారు. అక్కన్నపేట రైతు వేదికలో శుక్రవారం ఇందిరా మహిళా శక్తి పథకంలో పాడి పశువుల పెంపకానికి ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేలు జాతి పశువులపై అవగాహన చేసుకొని కొనుగోలు చేయాలన్నారు. ఏపీఎం శ్రీనివాస్ గౌడ్, డీఎంజీ ప్రసాద్, సీసీలు భిక్షపతి, తిరుపతి, రాజు, శ్రీలత, శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ నిశాంత్‌రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత పాల్గొన్నారు.

12లోగా దరఖాస్తు చేయండి

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 12 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కనకయ్య శుక్రవారం తెలిపారు. ఇప్పటికే రెండు విడతల అడ్మిషన్లు పూర్తయ్యాయని, 3వ విడత జరుగుతున్నాయని, ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సుప్రీం కోర్టు తీర్పును ఖండిస్తున్నాం

మాల మహానాడు, అంబేడ్కర్ సంఘం నాయకులు



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తాము ఖండిస్తున్నట్లు మాల మహానాడు, అంబేడ్కర్ సంఘం నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా మంద కృష్ణ మాదిగకు బీజేపీ ఇచ్చిన హామీ మేరకు సుప్రీం కోర్టుకు తప్పుడు నివేదికలు అందించిందన్నారు. వర్గీకరణపై ఇచ్చిన తీర్పు కేవలం రాజకీయ కోణంలోనే జరిగినట్లు అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో ఐకమత్యంగా ఉన్న ఎస్సీలను వర్గీకరణ పేరుతో విడదీయడం కోసమే ఈ తీర్పు వర్తిస్తుందన్నారు. గత 30 సంవత్సరాలుగా వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత బహుజన సంఘాలు పోరాటాలు చేశాయన్నారు. మాలల్లో ఐకమత్యం లేకనే ఈరోజు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహించే చైతన్య దీక్షలకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు, అంబేడ్కర్ సంఘం నాయకులు మద్దెల రాజేష్, ధార స్వామి, మద్దెల చంద్రం, నక్క రాజం, ధార మల్లయ్య, మంకయ్య, నర్సింహులు, కుమార్ చంద్రం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం

కోహెడ(హుస్నాబాద్): ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ కోహెడలలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు వెల్పుల సంపత్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ మంద రాజయ్య పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకం

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణ చేపట్టిన మూడు దశాబ్దాల పోరాటానికి విజయం లభించిందని బీజేపీ ఎస్సీమోర్చ జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ప్రధాని నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. అంబేడ్కర్, మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.

మద్దూరులో..

మద్దూరు(హుస్నాబాద్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మాజీ సర్పంచ్ రామడుగు బాలరాజు క్షీరాభిషేకం చేశారు.



గజ్వేల్‌లో ప్రధాని నరేంద్రమోదీ, మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **బాలుర జీజేసీ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్‌గౌడ్**

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాల (జీజేసీ) ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వాసవీ బదిలీపై విద్యానగర్ వెళ్లారు. అధ్యాపకులు శ్రీనివాస్‌గౌడ్‌కు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రకాష్, రాజిరెడ్డి, వెంకటరమణ, అష్రఫ్, హషమ్, మాధురి, జ్యోతి, గంగాలక్ష్మీ, మల్లేశం, నరేష్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

◆ **రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కృషి చేద్దామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

◆ **ఘనంగా మైదాకు సంబురం**

బెజ్జంకి(సిద్దిపేట): ఆషాఢ మాస మైదాకు సంబురాలను మండలంలోని గుగ్గిల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు మైదాకు పెట్టుకొని సందడి చేశారు. పండగల విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **స్వచ్ఛదనం.. పచ్చదనంపై సమీక్ష**

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలను తీర్చిదిద్దాలన్నా లక్ష్యంతో ఈనెల 5 నుంచి స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని చేపడతామన్నారు. 9వతేదీ వరకు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, అన్ని శాఖల అధికారులు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్‌ది కుటిల రాజకీయాలు**

దుబ్బాక: ఆడబిడ్డలను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ కుటిల రాజకీయాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తు దుబ్బాకలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

◆ **బహుమతుల అందజేత**

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల కోసం ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు సిద్దిపేట ఆర్టీసీ డీఎం సుఖందర్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళా ప్రయాణికులు అద్విక, సౌమ్య, పుష్ప లక్కీ డ్రాలో బహుమతులు గెలుచుకున్నారన్నారు.

◆ **ఆగస్టు 5 తుది గడువు**

కొముురవెల్లి(సిద్దిపేట): ఆగస్టు 5వతేదీతో రైతు బీమా దరఖాస్తు గడువు ముగుస్తుందని మండల వ్యవసాయ అధికారి నరేష్ శుక్రవారం అన్నారు. మండలంలోని రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 జూన్ 28 వరకు పట్టాదార్ పాస్ కలిగి వుండి 18 నుంచి 60 ఏళ్ల లోపు రైతులు అర్హులని అన్నారు. అర్హత ఉన్న రైతులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్స్ ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

◆ **సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన**

మండలంలోని గొల్లపల్లి నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శుక్రవారం ట్రాన్స్‌కో డీఈ భానుప్రకాష్, ఏఈ శివశంకర్ గ్రామ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గొల్లపల్లికి సబ్‌స్టేషన్ మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ మహేష్‌యాదవ్, కార్యదర్శి వెంకటేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **మౌలిక సదుపాయాలు కల్పించాలి**

చేర్యాల(సిద్దిపేట): ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, టీచర్లకు కనీస వేతనాలు చెల్లించేలా చూడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు విద్యాశాఖ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేవని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.